రూ.63 లక్షలతో అభివృద్ధి పనులు



పనులను శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత

ఉప్పల్: నియోజకవర్గ పరిధిలో అన్ని డివిజన్లలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ సర్కిల్ పరిధి చిలుకానగర్ డివిజన్‌లోని బీరప్పగడ్డ, ఈస్ట్ కల్యాణపురి కాలనీల్లో సీసీరోడ్లకు రూ.63 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీసీరోడ్లతో పాటు సివరేజ్ లైన్లను కూడా ఆధునీకరిస్తున్నట్లు వివరించారు. ఈస్ట్ కల్యాణపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్, బాలకృష్ణగౌడ్, కొండల్ రెడ్డి, బాలు, శ్యామ్, అశోక్‌చారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక బాధ్యత ఉండాలి



జయప్రకాశ్‌నారాయణకు జ్ఞాపికను అందజేస్తున్న సుశీల్‌కుమార్

బోడుప్పల్: విద్యార్థులు గురువుల పట్ల విధేయులై నైతిక విలువలు కలిగి ఉండాలని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్‌నారాయణ అన్నారు. బోడుప్పల్ పల్లవి మోడల్ స్కూల్ 11వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావిధానంలో తల్లిదండ్రుల్లో మార్పురావాలని, బట్టీపట్టడం, కాపీ కొట్టడం వల్ల వచ్చే మార్కుల కంటే విషయంపై అవగాహన వల్ల వచ్చే మార్కులకు విలువ ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యార్థులందరూ ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగ, కురుక్షేత్ర సంగ్రామం ఘట్టాలు, వివిధ దేశాల వేషధారణ, సంస్కృతులను వ్యక్తపరిచే నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ కొమురయ్య, డైరెక్టర్ సుశీల్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సుధ, ప్రిన్సిపాల్ తనూజ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థులతో కరాటే అసోసియేషన్ ఆఫ్ శివప్రసాద్

మల్లాపూర్: ఆత్మరక్షణకు ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతగానో దోహదపడుతుందని, బ్రూస్‌లీ ఛోటాఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు శివప్రసాద్ అన్నారు. ఆదివారం తార్నాకలో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ కరాటే టెస్ట్ పోటీలను నిర్వహించారు. బెల్ట్ గ్రేడింగ్‌లో వినీష్‌బూరి బ్లాక్‌బెల్ట్, ఆకాంక్ష బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్ బెల్ట్‌లు గెలుపొందారు. ఈ సందర్భంగా బెల్టులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కరాటే విద్యను అభ్యసించడం ద్వారా శరీరం, మనస్సు అధీనంలో ఉంటుందన్నారు. సెన్సీ హరీష్‌కుమార్, హరికేశవ, నవత, రాజేష్, మాస్టర్లు, బెల్ట్ గ్రేడింగ్‌లో టెస్ట్ పోటీలో దాదాపు 300 మంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

బోడుప్పల్: వాసవీనగర్ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.మోహన్‌బాబు, ఉపాధ్యక్షులుగా కిశోర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతికుమార్, కోశాధికారిగా సాయిగణేష్, కల్చరల్, ఆర్గనైజింగ్ మెంబర్స్‌గా సందీప్‌శర్మ, సంతోష్, లీగల్, మీడియా సలహాదారులుగా మల్లేష్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ మాట్లాడుతూ.. మాజీ అధ్యక్షులు, కాలనీ పెద్దల సలహాలను తీసుకుంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.



నూతన కమిటీ ప్రతినిధులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గీతిక కూచిపూడి అకాడమీ నాట్యగురువు లక్ష్మీఅనంతకృష్ణ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్యాలు అలరించాయి. మహాగణపతిమ్, చంద్రచూడా, ఆనంద తాండవం, గంధము పూయరుగా, అష్టపది, రాసలీల, సరస్వతిస్తుతి తదితర అంశాలను కళాకారులు మోక్షిత్, కృతిక, సాన్విక, ఆద్యవైత్రిక, స్ఫూర్తి తదితరులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

అభినయ కూచిపూడి నృత్యశాలకు అవార్డు

మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన అభినయ కూచిపూడి నృత్యశాలకు తెలుగు సంస్కృతి సాహితి సేవాట్రస్ట్ మహానది అవార్డు ప్రకటించింది. త్యాగరాజ గానసభలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. అభినయ కూచిపూడి నృత్యశాల నిర్వాహకురాలు గురువైన షెర్లీ మరియా పారక్ గిరి మాట్లాడుతూ.. ప్రాశ్చాత్య దేశానికి చెందిన తాను భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తానని, ఇక్కడే వివాహం చేసుకొని నృత్యపాఠశాల నిర్వహిస్తున్నానన్నారు. మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అభినందించారు.



మహానది అవార్డు అందుకున్న విద్యార్థులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

బోడుప్పల్: అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని మాజీ ఎంపీ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ అన్నారు. బోడుప్పల్‌లో అంబేడ్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల 300 వారాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచన విధానమే దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఆయన కన్న కలలను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు. బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి చైర్మన్ నత్తి మైసయ్య, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మ, బొమ్మక్ కల్యాణ్‌కుమార్, మేడ్చల్ బీ- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు బొమ్మక్ రమేష్, దానగల్ల యాదగిరి, గుర్రాల వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేక్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నత్తి మైసయ్య

ప్రశాంతంగా గ్రూప్ -3 పరీక్షలు

- రామంతాపూర్ పరిధిలో 7 పరీక్ష కేంద్రాలు
- సందర్శించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు



రామంతాపూర్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద సీపీ సుధీర్‌బాబు

రామంతాపూర్ : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-3 ఉద్యోగాల భర్తీకి సంబంధించి రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన 7 పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు ఆదివారం పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

◆ మొదటి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహించామని అధికారులు పేర్కొన్నారు.

◆ నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 పరీక్ష జరుగుతుందని అధికారులు ప్రకటించారు.

◆ రామంతాపూర్ పరిధిలో గ్రూప్-3 పరీక్షల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 444 అభ్యర్థులకు 155 మంది ప్రిన్స్‌టన్ పీజీ కళాశాలలో 768 అభ్యర్థులకు 23 మంది, వాగ్దేవి డిగ్రీ కళాశాలలో 408 అభ్యర్థులకు 164 మంది, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో 244 అభ్యర్థులకు 69 మంది, మెగా జూనియర్ కళాశాలలో 384 మంది అభ్యర్థులకు 107 మంది హాజరయ్యారని అధికారులు వివరించారు.

పటిష్ట బందోబస్తు..

గ్రూప్-3 పరీక్షల కోసం రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన 7 పరీక్షా కేంద్రాలను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సందర్శించి పరిశీలించారు.

సీపీ మాట్లాడుతూ.. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్‌ఓటీ డీసీపీ నరసింహారెడ్డి, ట్రాఫిక్ డీసీపీ మనోహర్, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ట్రాఫిక్, ఏసీపీ శ్రీనివాస్, ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్ సీఐ లక్ష్మి, మాధవి, ఎస్సైలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్ తనిఖీ..

అల్వాల్: అల్వాల్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, ఆదర్శ్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష నిర్వహణను ఆదివారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను ఆయన అడిగి తెలుసుకున్నారు.



అల్వాల్ పరీక్ష కేంద్రం వద్ద అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఆలయ వార్షికోత్సవ వేడుకలు



అల్వాల్: బొల్లారం రిసాల బజార్ భజరంగ్ కాలనీలోని శ్రీశీతల (పార్వతీదేవి సహిత శివ, నందీశ్వర, గణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయస్వామి) దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి రుద్రహోమం, పూర్ణాహుతి, శ్రీశీతలదేవీ సమేత పరమేశ్వర కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కుసుగుండ్ల నాగమణి, కుసుమకుమార్ రెడ్డి, దేవాలయ దాతలు, భజరంగ్‌నగర్ కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్మికులకు దుస్తుల పంపిణీ



కుషాయిగూడ: చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పుట్టినరోజు సందర్భంగా వాసవిశివనగర్ కాలనీలో స్వచ్ఛ ఆటో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, గోపాల్‌యాదవ్, బిక్షపతి, బాలనర్సింహ్మ, తాండ్ర యాదగిరి, చందు, వెంకట్‌రెడ్డి, బాను, రామారెడ్డి, నిర్మల, అరుణ, గిరిజ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: గ్రూపు-3 పరీక్షల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా అధికారులు గ్రూపు-3 పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రకటించారు.

టీఎన్‌జీవోస్ హాస్టల్ ఫోరం అధ్యక్షుడి నియామకం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా టీఎన్‌జీవోస్ హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడిగా ఎం.మాణిక్యం, కార్యదర్శిగా కె.కమల్ దాసు ఎన్నికయ్యారు. ఫోరం ఎన్నికలు కలెక్టరేట్‌లోని మినీ సమావేశంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్ హాజరయ్యారు. ఈ కొత్త కమిటీ మూడేళ్ల వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారి శ్రీనివాస్ వివరించారు. నూతన ఫోరం కమిటీలో కోశాధికారిగా తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా నరసింహ, జాయింట్ సెక్రటరీగా జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాఘవేంద్ర, ప్రచార కార్యదర్శిగా శ్రవణ్, ఈసీ సభ్యులుగా శ్రీనివాస్, వెంకటలక్ష్మిలు ఎన్నికయ్యారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం



మౌలాలి డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని సుధానగర్ మోడల్ కాలనీ, న్యూ వెంకటేశ్వర్‌నగర్, ద్వారకామాయి కాలనీ ఫేస్-2 ఈ మూడు కాలనీల ప్రజల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటించారు. వక్ఫ్‌బోర్డు రిజిస్ట్రేషన్ నిలిపివేతపై చేసిన ప్రకటనతో బాధితులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. దాదాపు 30 ఏళ్ల క్రితం ఏర్పాటైన కాలనీలు, బస్తీల నుంచి అన్ని రకాల పన్నులు వసూలు చేస్తూ.. గత ప్రభుత్వాలు అన్ని సౌకర్యాలు కల్పించాయన్నారు. రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని వక్ఫ్‌బోర్డు ప్రకటించడం ప్రభుత్వం అనాలోచిత చర్య అని విమర్శించారు. దీనిపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లి బాధితుల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నేతలు సుధానగర్ మోడల్ కాలనీ, న్యూ వెంకటేశ్వరనగర్, ద్వారకామాయి ఫేస్-2 వాసులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని ఆనంద్‌బాగ్, సర్దార్ పటేల్‌నగర్ ప్రాంతాల్లో రైల్వేస్టేషన్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. ఆదివారం ఆనంద్‌బాగ్, ఎస్పీనగర్ ప్రాంతాలను రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. చర్లపల్లి టర్మినల్ త్వరలోనే ప్రారంభం కానున్నడంతో అక్కడి నుంచి ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు చేరుకోవాలంటే ఎంఎంటీఎస్ ట్రైన్స్ నడపడం వల్ల వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అధికారులు నివేదిక తయారుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారని, త్వరలోనే సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ల పరిధిలోని జీఎంలను కలిసి సమస్యను వివరిస్తామన్నారు. ఎస్పీనగర్‌లో తగినంత స్థలం ఉండటంతో స్టేషన్ నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీకి సమీపంలో హాల్టింగ్ స్టేషన్‌కు అనువుగా లేకపోతే దయానంద్‌నగర్ స్టేషన్ సమీపంలో అనువైన స్థలం ఉందని అక్కడ నిర్మించాలన్నారు. ఏడీఈ ఎన్ శ్రీధర్, రామక్రిష్ణ, వెంకట్‌రెడ్డి, సుబ్బారావు, రవి, సాయి, చిన్నా పాల్గొన్నారు.



రైల్వే అధికారులతో కార్పొరేటర్ శ్రవణ్

ఉత్సాహంగా 'రన్ ఫర్ ద సన్'



సైక్లాథాన్‌లో పాల్గొన్న మర్రి లక్ష్మారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం 'రన్ ఫర్ ద సన్' సీజన్-2 కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన కార్యక్రమాన్ని ఎంఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాల డైరెక్టర్ సరితకుమార్, ప్రిన్సిపాల్ కల్పనతో కలిసి ప్రారంభించారు. వాక్‌థాన్ 5 కె, సైక్లాథాన్ 10 కె, శారీథాన్ 5 కె, 5 కె రన్ పోటీలు నిర్వహించగా.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైక్లాథాన్‌లో..

ఈ పోటీల్లో మర్రి లక్ష్మారెడ్డి ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులతో పోటీపడి మొదటి స్థానంలో నిలిచి అందరిని ఆనందపరిచారు. శారీథాన్‌లో హైదరాబాద్ రన్నర్స్ గ్రూప్‌నకు చెందిన తాడికొండ సుధా, మహిళలు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు డైరెక్టర్ సరిత కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్ మాట్లాడుతూ.. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు వారిని అన్ని రంగాల్లో ఉత్సాహపరిచేలా కార్యక్రమం నిర్వహించామన్నారు.

ఆటో డ్రైవర్ల వినూత్న నిరసన

జవహర్‌నగర్: రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల దుస్థితి ఘోరంగా ఉందని, 56 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నా.. ప్రభుత్వానికి కనువిప్పు కలగటం లేదని తెలంగాణ రాష్ట్ర బీఎంఎస్, బీపీటీఎంఎం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహ్మద్ హబీద్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర బీఎంఎస్, బీపీటీఎంఎం జేఏసీ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఆదివారం ఆటోడ్రైవర్లతో కలిసి వినూత్నంగా బిక్షాటన చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలను భిక్షాటన అడిగారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం తీసుకొచ్చి ఆటో డ్రైవర్ల నోట్లో మట్టి కొట్టారన్నారు. ఆటో డ్రైవర్లు పిల్లలకు స్కూల్ ఫీజులు కట్టలేక, పాలు కొనలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు, రూ.12 వేలు ఇవ్వాలని, లేదంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆటో సంఘం డ్రైవర్లు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 11కేవీ హేమానగర్ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు గాయత్రీహిల్స్, వాసవీనగర్, మల్లయ్యనగర్, సప్తగిరిహిల్స్, రెడ్డీస్‌కాలనీ, తిరుమల మెడోస్, హేమానగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాప్రా: విద్యుత్ మరమ్మతులు, విద్యుత్‌వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో నేడు సోమవారం సైనిక్‌పురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు కాలనీలకు సరఫరా నిలిచిపోనున్నట్లు ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈశ్వరీపురి కాలనీ, ఓయూటీ కాలనీ, మాధవపురి, ఎస్‌బీఓ కాలనీ, భాస్కర్‌రావునగర్, మాణిక్‌సాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు పేర్కొన్నారు.

రామంతాపూర్: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాఘవేంద్రస్వామి ఆలయ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు గణేష్‌నగర్ గోకులేనగర్ మెయిన్‌రోడ్డు, న్యూ గణేష్‌నగర్ పాశం సత్తయ్య కాలనీ, రామంతాపూర్, కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

ఉప్పల్: ఐఐసీటీ 11 కేవి సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, హబ్సిగూడ ఏఈ గణేష్ తెలిపారు. హబ్సిగూడ వీధి నంబర్ 1, 2, 3, భవానీనగర్, వీఎస్టీ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, హెచ్‌ఎంటీ నగర్ వీధి నెంబర్ - 1, రాజీవ్‌నగర్, నాచారం మెయిన్‌రోడ్డు, హెచ్‌ఎంటీ కమాన్ నుంచి పోలేరమ్మ దేవాలయం వరకు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి



వనభోజన మహోత్సవంలో కాపుకులాల ప్రతినిధులు

కుషాయిగూడ: కాపులు తమ ఐక్యతను చాటి హక్కులు సాధించుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి అన్నారు. కార్తీకమాసం సందర్భంగా కాప్రా కాపు కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు రజతోత్సవ వనభోజన మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ అధ్యక్షుడు నీలం రాంబాబునాయుడు, సుబ్బారావు, రామారావు, రాఘవేందర్ రావు, కాప్రా కాపు కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.వి.ఎన్ రావు, ప్రధాన కార్యదర్శి నాగు, రెడ్డి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, శంకర్‌బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



మల్లన్న దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం

గౌతంనగర్: కార్తీకమాసం సందర్భంగా గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం, వనభోజనాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

బోడుప్పల్: ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ లక్ష్మీనగర్ కాలనీలోని హుడాపార్కును ఆదివారం ఆయన సందర్శించారు. పార్కులో వాకర్స్, చిన్న పిల్లలతో ముచ్చటించారు. అనంతరం కాలనీవాసులతో పార్కు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, దశలవారీగా అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.